క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవం విజయవంతానికి పిలుపు


మజ్జి చంద్రుబాబు

పెదబయలు: ఈ నెల 12న జరిగే వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు మజ్జి చంద్రుబాబు పిలుపునిచ్చారు. అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం, ఎంపీ గుమ్మా తనూజరాణి ఆదేశాల మేరకు పెదబయలు అంబేడ్కర్ కూడలిలో పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమం, కేక్ కటింగ్, అనంతరం దివంగత మహానేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించడం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, వార్డు సభ్యులు, అభిమానులు ఈ వేడుకల్లో పాల్గొనాలని కోరారు. అనంతరం పాడేరు జిల్లా కేంద్రంలో జరిగే యువత పోరు బాట కార్యక్రమంలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

తాగునీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక చర్యలు


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో ఉమామహేశ్వరరావు

గూడెంకొత్తవీధి: వేసవిలో గూడెం కొత్తవీధి మండలంలోని 16 పంచాయతీల్లో తాగునీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను అమలు చేయాలని ఎంపీడీవో ఉమామహేశ్వరరావు సూచించారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఇంజినీరింగ్ సహాయకులతో ప్రత్యేక సమావేశం జరిగింది. జలజీవన్ మిషన్ కింద చేపట్టిన పనులు, వేసవిలో అమలు చేయాల్సిన కార్యాచరణ ప్రణాళిక క్రాష్ ప్రోగ్రాం వంటి వాటిపై పలు సూచనలు చేశారు. తాగునీటి సమస్యపై గిరిజనుల నుంచి ఫిర్యాదులు వచ్చిన వెంటనే పరిష్కరించాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తాగునీటి సరఫరా విభాగం ఏఈఈ కల్యాణ్, ఈవో పీఆర్డీ పాపారావు, తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు


తాగునీటిని అందిస్తున్న ఇమామ్ ఇజాజ్ అహ్మద్


చింతూరు: ఎండ తీవ్రత పెరుగుతున్న దృష్ట్యా స్థానిక మస్జీదే యాసిన్ ఆధ్వర్యంలో స్థానిక మెయిన్‌రోడ్ సెంటర్లో సోమవారం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి మండల కేంద్రానికి వచ్చే ప్రజలతో పాటు బస్సులు, ఇతర వాహనాలు ఆగిన సమయంలో ప్రయాణికులు దాహార్తి తీర్చుకునేందుకు ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు ముస్లిం పెద్దలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇమామ్ ఎజాజ్ అహ్మద్, ముర్షీద్, దస్తగిర్, జవహర్, సుభానీ, కరీముల్లా, అయ్యూబ్, సాజిద్ పాల్గొన్నారు.

మూడు ఆలయాలకు మైక్ సెట్ల బహూకరణ


మైక్‌సెట్లను అందిస్తున్న ప్రసాద్, తదితరులు

కొయ్యూరు: బట్టపనుకుల, కొత్తూరు రామాలయాలు, గంగవరం బాల వినాయక ఆలయానికి ధార్మిక సంస్థల సేవ ప్రతినిధి డీవీడీ ప్రసాద్ సోమవారం మైక్‌సెట్లను బహూకరించారు. బట్టపనుకులలో సోమవారం అర్చకులతో సమావేశం నిర్వహించారు. దీనిలో భాగంగా పాడి, టింకలపనుకుల, గన్నేర్లపాలెం, గడపాలెం, మర్రిపాకల, మూలపేట, ధర్మవరం, కృష్ణాపురం రామాలయాలకు భజన తాళాలను దానధర్మ చారిటబుల్ సంస్థ ప్రతినిధులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయా సంస్థలకు చెందిన పల్లి లోవరాజు, ఎస్ఎస్ఎఫ్ ధర్మ ప్రచారక్ మాదల శ్రీను, వనముల మల్లేశ్, దుచ్చరి కృష్ణం రాజు, కుప్పా నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు బస్సుల్లో ప్రత్యేక సీటు కేటాయించాలి


పాడేరు ఆర్టీసీ డిపో సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేస్తున్న రవి

విశాఖపురం: దివ్యాంగులకు బస్సుల్లో ప్రత్యేక సీట్లు కేటాయించాలని ఏఎస్‌డీఎస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సోమవారం పాడేరు ఆర్టీసీ డిపో సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కు కూడా దరఖాస్తు చేసుకున్నట్టు కో–ఆర్డినేటర్ నెరపటి రవి తెలిపారు.



ఆపరేషన్ థియేటర్


అడ్డతీగల సామాజిక ఆరోగ్య కేంద్రం

పేరు ఘనం.. సేవలు పూజ్యం

- అడ్డతీగల సీహెచ్‌సీలో అంతంత మాత్రంగా సేవలు
- భర్తీకి నోచుకోని స్పెషలిస్ట్ వైద్యుల పోస్టులు
- కాంట్రాక్టు కాలపరిమితి పెంచని వైనం

అడ్డతీగల: అడ్డతీగల సామాజిక ఆరోగ్య కేంద్రం పేరు ఘనంగా కనిపించినా సేవలు మాత్రం సాధారణ స్థాయి వైద్యాన్ని మించడం లేదు. ఇద్దరు సివిల్ అసిస్టెంట్(జనరల్) వైద్యులతోనే కాలం నెట్టుకొస్తున్న దుస్థితి నెలకొంది. ఐదు సివిల్ అసిస్టెంట్ సర్జన్ పోస్టులకు ప్రస్తుతం ఇద్దరే ఉన్నారు. స్పెషలిస్టు వైద్యుల అవసరాన్ని గుర్తించి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో సివిల్ అసిస్టెంట్ సర్జన్ సర్జరీ, గైనకాలజిస్టు, పీడియాట్రీషియన్ పోస్టులను కాంట్రాక్ట్ ప్రాతిపదికన భర్తీ చేశారు. ఆరు మాసాల క్రితం వారి కాలపరిమితి ముగిసినా రెన్యువల్ చేయకపోవడంతో ముగ్గురూ విధులకు హాజరు కావడంలేదు. 10 ఏళ్లలోపు చిన్నారులు అధికారిక రికార్డుల ప్రకారం 30 నుంచి 40 మంది ప్రతి రోజు ఓపీకి వస్తున్నారు. చేసేదిలేక అధికారుల అనుమతితో వై.రామవరం సీహెచ్‌సీలో ఉన్న ఇద్దరు పీడియాట్రీషియన్లలో ఒక పీడియాట్రీషియన్‌ని వారంలో మూడు రోజులు ఇక్కడికి రప్పిస్తున్నారు.

ఇక గైనకాలజిస్టు సేవలు మరింత అవసరం. నెలకు 20 వరకూ ప్రసవాలు జరుగుతుంటాయి. ఆసుపత్రిల్లో ప్రసవాలను ప్రోత్సహించండి అని ఊదరగొడుతూనే స్పెషలిస్టు వైద్యుల నియామకాలు మాత్రం జరపని వింత వైఖరిని కూటమి ప్రభుత్వం కొనసాగిస్తోంది. మత్తు వైద్యుల పోస్టుకు అనుమతి ఉన్నా భర్తీకి నోచుకోలేదు. ఆసుపత్రి ప్రసవాలు పెంచాలన్నా అవకాశం లేని పరిస్థితి నెలకొంది. దీంతో ఆపరేషన్ థియేటర్ ఎప్పుడూ మూసే ఉంటోంది. మెటర్నిటీ అసిస్టెంట్ పోస్టు కూడా 15 ఏళ్లకు పైబగా ఖాళీగానే ఉంది. ఉన్న ఇద్దరు వైద్యులే కాలం నెట్టుకొస్తున్నారు. ప్రతి రోజు 150 వరకూ ఓపీ ఉండగా వారపు సంత రోజు మంగళవారం అయితే 300 వరకూ ఓపీ నమోదు అవుతుంది.

మందులకు కాకినాడ జనరిక్ షాపే దిక్కు

సెంట్రల్ డ్రగ్ స్టోర్ నుంచి తెచ్చుకున్న మందులు నిండుకుని ఆస్పత్రిలో మందుల కొరత వస్తే కాకినాడలోని జనరిక్ మందుల షాపు నుంచి ఇండెంట్ పెట్టి రప్పిస్తున్నారు. ఇవి రావడానికి మూడు నుంచి నాలుగు రోజులు పడుతుంది. అంతకీ అర్జెంట్ అయితే బయట షాపుల్లో కొనుగోలు చేసుకోవాలని రోగులకు సూచిస్తున్నారు.

కానరాని తోటి పోస్టుల భర్తీ

అడ్డతీగల, వై.రామవరం, రాజవొమ్మంగి, గంగవరం మండలాలకు సంబంధించి పోస్టుమార్టం కేసుల ఏమైనా ఉంటే అడ్డతీగల సీహెచ్‌సీలోనే చేయాలి. పోస్టుమార్టం నిర్వహణకు వైద్యులు ఎంత ముఖ్యమో తోటి కూడా అంతే ప్రధానం. కానీ రెండు తోటి పోస్టులు అనుమతి ఉన్నా 15 ఏళ్లుగా వాటి భర్తీ జరగడం లేదు. దీంతో శానిటేషన్ వర్కర్లు, ఇతరత్రా సిబ్బందితో ఆ పనులు కానిచ్చేస్తున్నారు.

రోగులకు ఇబ్బంది లేకుండా సేవలు



ఆస్పత్రికి వచ్చే రోగులకు ఇబ్బంది లేకుండా సేవలందిస్తున్నాం. కాంట్రాక్ట్ వైద్యుల కాలపరిమితి ముగిసిపోవడంతో వారు వెళ్లిపోయారు. స్పెషలిస్టు వైద్యుల అవసరం ఉంది. మందులు అవసరం అయితే కాకినాడ నుంచి తెపిస్తున్నాం.
– సతీష్, సూపరింటెండెంట్, అడ్డతీగల సీహెచ్‌సీ

'పది'లో శత శాతం ఉత్తీర్ణతకు కృషి


ఆశ్రమ పాఠశాలల వార్డెన్‌లతో మాట్లాడుతున్న ఏటీడబ్ల్యూవో జయనాగలక్ష్మి

చింతపల్లి: ఆశ్రమ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులు శత శాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలని ఏటీడబ్ల్యూవో జయనాగలక్ష్మి అన్నారు. స్థానిక కార్యాలయంలో చింతపల్లి, జీకే వీధి మండలాల వసతి గృహ సంక్షేమ అధికారులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వారం రోజుల్లో జరిగే వార్షిక పరీక్షలకు విద్యార్థులను సంసిద్ధం చేయాలన్నారు. మండలంలోని 10 ఆశ్రమ పాఠశాలలకు సంబంధించి చింతపల్లి కేంద్రంగా పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆయా పాఠశాలల్లో ముందుగానే చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలిగినా సదరు ఆశ్రమ పాఠశాల వార్డెన్‌దే బాధ్యతని ఆమె హెచ్చరించారు. ఆశ్రమాల్లో తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు తదితర సౌకర్యాలను మెరుగుపర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌డబ్ల్యూవోలు వినాయకరావు, తిరుపతి, నూకరత్నం, గణేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సైకిళ్ల బహూకరణ

అడ్డతీగల : విజయవాడ అమ్మ హెల్పింగ్ ఫౌండేషన్(ఏహెచ్ఎఫ్) ప్రతినిధి దివ్య ఆధ్వర్యంలో రాయపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న నిరుపేద విద్యార్థులకు సోమ వారం సైకిళ్లు బహూకరించారు. రాయపల్లి జెడ్పీ పాఠశాలకు విద్యార్థులు దూర ప్రాంతం నుంచి నడిచి రావడం చూసి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సైకిళ్లు అందజేశామని దివ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో సచివాలయ ఇంజినీర్ నరేష్, ఏఎస్ఎం, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు. సైకిళ్లు అందజేసిన ఫౌండేషన్ ప్రతినిధులకు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.


విద్యార్థులకు సైకిళ్లు అందిస్తున్న విజయవాడ అమ్మ హెల్పింగ్ ఫౌండేషన్ ప్రతినిధి దివ్య

గంగవరం సచివాలయం సందర్శన


గంగవరం గ్రామ సచివాలయంలో రికార్డులు తనిఖీ చేస్తున్న తహసీల్దార్ శ్రీనివాసరావు

గంగవరం : మండల కేంద్రమైన గంగవరం గ్రామ సచివాలయాన్ని తహసీల్దార్ సిహెచ్.శ్రీనివాసరావు సోమవారం ఆకస్మికంగా సందర్శించారు. రికార్డులు తనిఖీ చేశారు. సచివాలయం సిబ్బంది సక్రమంగా పనిచేయాలని, అన్ని రిజిస్టర్స్ పక్కాగా నిర్వహించాలని, సిబ్బంది ఫీల్డ్ వర్క్‌కు వెళితే మూమెంట్ రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. సిబ్బంది సకాలంలో విధులకు హాజరు కావాలని, ముందస్తు అనుమతి లేకుండా గైర్హాజరైతే చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి కృష్ణస్వామి, వీఆర్వో వెంకన్నదొర, సిబ్బంది పాల్గొన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

చింతపల్లి: గర్భిణులు క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకున్నప్పుడే ఆరోగ్యవంతమైన బిడ్డలను పొందవచ్చునని స్త్రీ వైద్య నిపుణులు డాక్టర్ అనీష అన్నారు. సోమవారం స్థానిక ఏరియా ఆస్పత్రిలో 62 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు చేసి, అవసరమైన మందులు పంపిణీ చేశారు. ప్రతి నెలా వైద్య పరీక్షలు చేయించుకోవడంతో పాటు క్రమం తప్పకుండా రోజూ మందులు వాడకం, మంచి పౌష్టికాహారాన్ని తీసుకోవడం వల్ల గర్భిణికి, పుట్టే బిడ్డకు శ్రేయస్కరమని అనీష చెప్పారు.


గర్భిణులకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

గిరిజన గ్రామాల్లో సదుపాయాలు కల్పించాలి

ముంచంగిపుట్టు: గిరిజన గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పాంగి పద్మారావు డిమాండ్ చేశారు. మండలంలోని మారుమూల బుంగాపుట్టు, లక్ష్మీపురం పంచాయతీల్లోని పలు గ్రామాల్లో సోమవారం వైఎస్సార్‌సీపీ నేతలు పర్యటించారు. తాగునీరు, రహదారులు, పాఠశాలల భవనాలు వంటి సమస్యలను గిరిజనులు నేతల దృష్టికి తీసుకువచ్చారు. సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని వారు గిరిజనులకు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా పద్మారావు మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నా రు. లక్ష్మీపురం పంచాయతీ దొరగూడ గ్రామానికి పక్క రహదారి సౌకర్యం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకుడు మూర్తి, తదితరులు పాల్గొన్నారు.


కిందుగూడలో గిరిజనులతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నేతలు

భీమలింగేశ్వర స్వామికి ఏకాదశి పూజలు


పెదబయలు భీమలింగేశ్వర స్వామి ఆలయంలో పూజల్లో పాల్గొన్న భక్తులు

పెదబయలు: పెదబయలు–సీతగుంట భీమలింగేశ్వర స్వామి ఆలయంలో ఏకాదశి జాతర సందర్భంగా సోమవారం తెల్లవారుజాము నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారికి అభిషేకాలు, అష్టోత్తర పూజ చేశారు. భక్తుల గోత్ర నామాలతో అర్చన జరిపారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఏటా మార్చి నెలలో వచ్చే మొదటి ఏకాదశి నాడు జాతర నిర్వహించడం ఆనవాయితీ. ఆలయంతో పాటు గిరిజన సంక్షేమ బాలికల పాఠశాల రోడ్డు నుంచి సీతగుంట రెండు రోడ్ల జంక్షన్ వరకు విద్యుత్ దీపాలంకరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షుడు రూడ లక్ష్మణరావు, సభ్యులు తలారి చక్రధర్, శశిధర్, జీవన్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

102 మంది గర్భిణులకు ప్రత్యేక వైద్య పరీక్షలు


వై.రామవరం సీహెచ్‌సీలో గర్భిణులకు స్కానింగ్ చేస్తున్న వైద్యాధికారులు

వై.రామవరం: పీఎంఎస్ఎంఏ కార్యక్రమంలో భాగంగా స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో సోమవారం 102 మంది గర్భిణులకు ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించారు. స్థానిక సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ రాహుల్ ఆధ్వర్యంలో గర్భిణులకు స్కానింగ్‌లు, రక్త పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులు పంపిణీ చేశారు. వీరిలో 40 మంది హైరిస్క్ గర్భిణులను గుర్తించి ఆస్పత్రిలో చేర్చారు. వారికి ప్రత్యేక వైద్య సేవలతో పాటు, అవసరమైన మందులు అందించారు. ఈ కార్యక్రమంలో గైనకాలజిస్ట్ డాక్టర్ రాకేష్, సీహెచ్‌సీ వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. మండలంలోని చవిటిదిబ్బలు పీహెచ్‌సీలో కూడా వైద్యాధికారులు నరేంద్ర, దినేష్‌ల ఆధ్వర్యంలో గర్భిణులకు స్కానింగ్‌లు, ప్రత్యేక వైద్య పరీక్షలు చేశారు.

పదో తరగతి విద్యార్థులకు అట్టల అందజేత


అట్టలు అందుకున్న విద్యార్థులతో వైఎస్ఆర్ ట్రస్టు చైర్మన్ సురేష్‌కుమార్

డుంబ్రిగుడ: మండలంలోని కించుమండ బాలుర ఆశ్రమ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు డాక్టర్ వైఎస్ఆర్, టీఎస్ఆర్ ట్రస్టు చైర్మన్ తెడాబరికి సురేష్‌కుమార్ సోమవారం అట్టలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతిలో ప్రతి విద్యార్థి మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కించుమండ స్టేట్ బ్యాంక్ మేనేజర్ కె.బాలరాజు, హెచ్ఎం గెన్ను, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


అరకులోయలో యువత పోరు పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం, పార్టీ నాయకులు

విద్యార్థులు, యువతకు కూటమి ప్రభుత్వం టోకరా

ముంచంగిపుట్టు: విద్యార్థులను, యువతను కూటమి ప్రభుత్వం మోసం చేసిందని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పాంగి పద్మారావు ఆరోపించారు. మండల కేంద్రం ముంచంగిపుట్టులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సోమవారం సర్పంచులు, ఎంపీటీసీలు, నేతలతో ఆయన సమావేశమయ్యారు. మొదటగా కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఈ నెల 12న నిర్వహించే వైఎస్సార్‌సీపీ యువత పోరు పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పద్మారావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలు అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. యువతకు ఉద్యోగ కల్పన, నిరుద్యోగ భృతి, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వకుండా దగ చేసిందని ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చేలా యువత పోరు కార్యక్రమం నిర్వహిస్తున్నామని, యువత, విద్యార్థులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు రమేష్, నరసింగరావు, బాబూరావు, ఎంపీటీసీ గణపతి, వైఎస్సార్‌సీపీ జిల్లా నేతలు మూర్తి, జగబంధు, కొండలరావు, మండల నాయకులు జయదేవ్, అప్పారావు, రాంప్రసాద్, తిరుపతి, దేవ, నీలకంఠం, జగన్, తదితరులు పాల్గొన్నారు.


ముంచంగిపుట్టులో పోస్టర్ ఆవిష్కరిస్తున్న పార్టీ మండల అధ్యక్షుడు పద్మారావు, తదితరులు

సాగులో ఉన్న భూములకు పట్టాలివ్వాలి

చింతపల్లి: ఆదివాసీ గిరిజనులు దశాబ్దాలుగా సాగు చేస్తున్న భూములకు పట్టాలివ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బోనంగి చిన్నయ్యపడాల్ డిమాండ్ చేశారు. గిరిజన సమస్యల అధ్యయనానికి చేపడుతున్న ప్రజా చైతన్య యాత్రలు కార్యక్రమంలో భాగంగా సోమవారం కొత్తవీధి గ్రామాన్ని సందర్శించారు. గ్రామంలో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో గడిచిన 40 ఏళ్లుగా 25 కుటుంబాలు వ్యవసాయమే ఆధారంగా జీవనాన్ని కొనసాగిస్తున్నారని, వారికి నేటి వరకు ఎటువంటి పట్టాలను ప్రభుత్వం అందించలేదన్నారు. కనీసం ఆ గ్రామానికి పూర్తి స్థాయి రోడ్డు సౌకర్యం కూడా కల్పించడంలో ప్రభుత్వం తాత్సారం చేస్తుందన్నారు. గిరిజన గ్రామాల్లో మంచినీటి సమస్య వేధిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. అర్హత ప్రతి గిరిజనుడికి పక్కా ఇళ్లు మంజూరు చేయాలన్నారు. ఈ ప్రజా చైతన్య యాత్రలు ఈ నెల 25 వరకూ కొనసాగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మజ్జి రాంబాబు, లక్కు, చైతన్య, బీమరాజు, షర్మిల, సోమేష్, లత సావిత్రి, తదితరులు పాల్గొన్నారు.


కొత్తవీధిలో గిరిజనుల సాగులో ఉన్న భూములను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

తాగునీటి కోసం ఖాళీ బిందెలతో నిరసన

అరకులోయటౌన్: మండలంలోని పెదలబుడు మేజర్ పంచాయతీ పరిధిలోని అరకులోయ పట్టణంతో పాటు శరభగుడ, జెడ్పీ కాలనీ, రెంటల్ హౌసింగ్ కాలనీ, కొండవీధి, ఆదివాసీ కాలనీ, ఆస్పత్రి కాలనీ, శరభగుడ కాలనీలలో తాగునీటి సమస్యను పరిష్కారించాలని సోమవారం గిరిజన మహిళలు ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అల్లూరి జిల్లా ఆదివాసీ గిరిజన సంఘం ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్ మాట్లాడుతూ గతంలో కుళాయిల ద్వారా వీధుల్లో నీటి సరఫరా జరిగేదని, ప్రస్తుతం నీటి సరఫరా నిలిపివేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వేసవి ప్రారంభంలోనే ఇలా ఉంటే ముందు నీటి ఎద్దడి తీవ్రమయ్యే ప్రమాదం ఉందన్నారు. వెంటనే ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ అధికారులు, పాలకులు స్పందించి గ్రామాల్లో నీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలని బాలదేవ్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మహిళలు మాదల కాసులమ్మ, కొర్రా రాజేశ్వరి, మణి, కుమారి, మల్లేశ్వరి, నిన్నిబుడ్డి, డొమిని, ఏపీజీఎస్ నాయకులు కిల్లో రాజు, అజయ్, వెంకటరావు, విజయ్‌రాజు, తదితరులు పాల్గొన్నారు.


ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న గిరిజన మహిళలు

వినియోగదారుల హక్కులపై అవగాహన అవసరం

చింతపల్లి: వినియోగదారుల హక్కులు, చట్టాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని జిల్లా వినియోగదారులు సంఘాల సమాఖ్య అధ్యక్షుడు బూడిద చిట్టిబాబు అన్నారు. ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవంలో భాగంగా స్థానిక ఏపీఆర్ కళాశాలలో వినియోగదారులు, విద్యార్థులకు సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చిట్టిబాబు మాట్లాడుతూ నిత్యం వాడుతున్న వస్తువుల నాణ్యత ప్రమాణాలు, ధరలు గమనించాలన్నారు. ఏ కల్తీ వస్తువును మార్కెట్‌లో అమ్మకాలు సాగించినా వినియోగదారుల సంఘానికి ఫిర్యాదు చేయాలన్నారు. ఎస్ఐ వెంకటరమణ మాట్లాడుతూ విద్యార్థులు గంజాయి, మత్తు, మారక ద్రవ్యాలు జోలికి పోకుండా ఉన్నత చదువులు సాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కె.వి.రామేశ్వరం, చింతపల్లి మండల సంఘం అధ్యక్షుడు పనసల చిట్టిబాబు, సభ్యులు భాస్కరరావు, రంగారావు, జగ్గారావు, రాజరత్నం, తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న వినియోగదారుల సంఘాల సమాఖ్య జిల్లా అధ్యక్షుడు చిట్టిబాబు

వైభవంగా గుంటసీమ జంగమయ్య జాతర

డుంబ్రిగుడ: మండలంలోని గుంటసీమ పంచాయతీ కేంద్రంలో కొలువైన జంగమయ్య జాతర సర్పంచ్ గుమ్మ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో సోమవారం వైభవంగా జరిగింది. వైస్ ఎంపీపీ శెట్టి ఆనందరావు, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు, అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి కొబ్బరికాయలు కొట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఒడియా నాటిక, థింసా నృత్యాలతో జాతర సందడిగా సాగింది. ఎండపల్లివలస మహిళల కోలాటం ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బాకా సింహాచలం, సురేష్, గణపతి, అశోక్‌కుమార్, ఉత్సవ కమిటీ సభ్యులు ప్రేమానందం, కొండలరావు, లక్ష్మీదర్, గాసి ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.


గుంటసీమలో పూజలు చేస్తున్న సర్పంచ్ నాగేశ్వరరావు, ఇతర నాయకులు

శివాలయంలో అన్నదానం

గంగవరం : కుసుమరాయి గ్రామంలోని శివాలయంలో గంగవరం గ్రామానికి చెందిన కె.రామకృష్ణ, సునీత ఆధ్వర్యంలో సోమవారం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో గంగవరం, ఆముదాలబంద సర్పంచ్‌లు కలుముల అక్కమ్మ, పాయం రాజమ్మ, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.


కుసుమరాయి శివాలయంలో అన్నదానం చేస్తున్న గంగవరం గ్రామస్తులు